# అదృష్టము

* శ్రీమతి బి. సరోజినీ దేవి గారు *

నళిని అప్పుడే కాలేజీనుంచివచ్చి తనగదిలో బల్లదగ్గర తల వంచుకొని విచారంగా కూర్చొని ఆలోచిస్తోంది. కళ్లంట జలజలానీరు కారుతోంది. కాలేజినుండి వస్తూనే నళిని గది లోనికి వెళ్లి కళ్లు మూసాడు, మనోహర్. కాని వెంటనే తృళ్లిపడి చేత్తో ముఖం త్రిప్పి "అదేమిటి నళినీ ఏడుస్తున్నావా ?"

"ఛా ! లేదు బావా కంట్లో నలకపడింది. అందుచేత కళ్లంట నీరుకారుతోంది"

"నాకు తెలుసులే నీవు ఎందుకేడుస్తున్నావో, అవును కాని అమ్మ అక్కయ్యలేరి ?"

"వాళ్లందరు సినీమాకు వెళ్లారు బావా !"

"అయితే నువ్వు వెళ్లలేదేం ?"

"పరీక్షలు దగ్గరి కొస్తున్నాయని వెళ్లలేదు."

"దానికేంలే నళినీ ! నువ్వు నేనుకలసి వెడదాంలే!"

"అది ఒక్కటీ తక్కువయింది. యిప్పటికే నానా మాటలు వచ్చాయ్ ! మనమిద్దరం కలసి సినీమాకు వెడితే నా చదువుకు సలాంయిచ్చి దేశాంతరం వెళ్లాలి."

"అదేమిటి నళినీ అలాఅంటావ్. నేను స్కూలుఫైనలు చదువుచున్నప్పట్నుంచి నిన్ను పెళ్లిచేసుకుందామనుకొంటు న్నాను. అప్పుడే మనకు వివాహమై 4 సం॥ అయింది. తెల్సిందా ?"

"చాల్లేబాబూ ఊరుకో ఎవరైన వింటే నవ్వుతారు. నీకు సంబధం నిశ్చయం అయింది. మాఘమాసంలో పెండ్లని తెల్సింది. గొప్పింటి అల్లుడవవుతున్నావు. నేను బీదదాన్ని. నన్ను చేసుకోడానికి మీ నాన్నగారు అమ్మగారు వప్పుకో వద్దూ."

"ఇప్పుడా సంగతెందుకు గానీ ఎల్లుండి దీపావళి కదా నాకేమిటి బహుమాన మిస్తావ్. నేను మదరాసుకు వెళ్లి పోతున్నాను."

"బావా ! ఆడుదాన్ని నేనేమిటివ్వగలను. నీవు మదరాసుకు వెళ్లిపోతే నేను ఎలాగుండగలనో నాకే అర్థమవటం లేదు."

"అవీ సంగతి అలా చెప్పు అందుకే ఏడుస్తున్నావ్. నేను రేపే మదరాసు వెళ్లిపోతున్నాను."

"అదేం బావా ! దీపావళివెళ్లిన తర్వాత వెళ్లు."

"ఆ రోజుననే నక్కడ పనిలో చేరాలి నళినీ"

"సరేలే. సినిమావదిలే వేళ అయింది. అమ్మ వాళ్లు వస్తారు పడుకో."

నళిని తల్లితండ్రులులేని అభాగిని. మేనత్తగారి యింట్లో నుండి ఇంటర్ చదువుతోంది. మనోహర్ యం. యస్‌సి., పాసయి మదరాసులో లెక్చరర్‌గా నున్నాడు. మనోహర్ నళినులు చిన్నప్పటినుండి ప్రేమించుకొన్నారు. కాని మేనత్త కిష్టములేదు. నళినికి డబ్బులేని కారణంచేత ఆమెను మనోహర్‌కు చేసికోదల్చుకోలేదు. నళినిది అందాలుచిందేముఖము. నిర్మల హృదయము కలది. కాని ఏమిలాభము ? ఆమె కోరుకొన్న మనోహర్ తనకు కాకుండగా ఇంకొకరి ఆధీనముఅగుచున్నాడని ఆమె చాల బాధపడుచున్నది. ప్రేమకు బీద గొప్ప అనే తారతమ్యం ఉన్నదా ? ప్రేమ హృదయంలో నుండి పుడుతుంది కాని డబ్బునుండి పుడుతుందా ? ఈఆలోచనలతో ఎప్పుడూ విచారంగా ఉండేది. మనోహర్ వెళ్లి సం॥ అయింది. సమంగా ఆరోజు దీపావళి అందరి యిండ్లలోను తలంట్లుపోసికొని, క్రొత్త దుస్తులు ధరించుకొని పిండి వంటలతో భోజనాలు చేస్తున్నారు. కాని నళినిని ఎవరూ తలంటి పోసికోమనలేదు. భోజనానికైనా రమ్మనలేదు. ఆ అబల ఆకటిమంటతో తనగదిలోకి వెళ్లింది. ఆ విచారంలో సంతోషం కల్గించేది మనోహర్ ఫోటో ఒక్కటే. ఫోటో తీసి "బావా ! నీవు క్రిందటి సంవత్సరం రేపు దీపావళి యనగా వెళ్లావు. ఈ రోజు మళ్లీ దీపావళి. కాని ఏంలాభం ప్రతి యింటా దీపావళి. నా హృదయములో, అంధ

కారము. నా తల్లి తండ్రులు పోయినా నీముఖ పద్మమువలన నా కష్టములు మరచి ఆనందముగా ఈ 16 సం॥ ఉండగల్గాను కాని బావా! ఈ రోజుతో నా జీవితంపై నాకే రోత పుట్టుతోంది. నేను జీవితకాలం నీ పాదాలచెంత వాడని మల్లెపూదండలా ఉంటా ననుకున్నా. కాని... యింక నాది దరిద్రజీవితం, ఎడారి, వసంతాగమనం నోచుకోనికారడవి" ఇంక మాట్లాడలేక పోయింది. కన్నీళ్లు కారి పోతున్నాయి. మేనత్త "నళినీ ఎక్కడున్నావే? దీపాలన్నీ వెలిగించి ఒక పాటపాడమంటూ" చెప్పి వెళ్లిపోయింది. తప్పనిసరిగా దీపాలతో వీధి నలంకరించింది. చావిట్లోకి వచ్చి కూర్చుంది. "పాట పాడవే" అంది చిన్న వదినెగారు లక్ష్మి.

"ఏం పాడను వదినా"

"హిందీ పాట ఏదైనా పాడవే"

ఇంతల్లో కిస్మత్ లోని "హైదునియబతా" పాటజ్ఞాపకం వచ్చింది. తనజీవితం కూడా అలాగే ఉందికదాని ఆపాటే మొదలుపెట్టింది సగంపాటపాడింది. వీధిలోబండి ఆగినచప్పుడైంది అందరు వీధివైపు చూస్తున్నారు. మనోహర్ లోపల కొచ్చాడు. మనోహర్‌ను చూడగనే నళినికెక్కడలేనిసంతోషంవచ్చి పాట మంచి ఉషారుగా పాడింది. మొదట విచారంగా పాడినందుకు అందరు తెల్లబోయ్యారు. తర్వాత అందరూ సర్దాగా బాణసంచా అంతా కాల్చి కొంచెం సేపు కబుర్లు చెప్పుకొని పడుకొన్నారు. మనోహర్ మెల్లగా నళినీ గదిలోనికి వచ్చాడు. "నళినీ పడుకున్నావా?"

"లేను బావా! నీకోసమే చూస్తున్నాను. ఈ రోజు నాకు చాల సంతోషంగా ఉంది బావా"

"ఔను అందుకేనా కిస్మత్‌లో రాణి హైదునియబతా ముందర విచారంగా పాడుతుంది. తర్వాత తన ప్రియుని చూడగనే సంతోషంగా పాడుతుంది."

"ఔను బావా! నా ప్రియుడు నన్ను వదలి దూరముగా వెళ్లిపోయాడు. మరివిచారం కాక సంతోషంఎలా వస్తుంది? మళ్లీ నా ప్రియుడు నన్ను కలుసు కున్నాడు. నాకు సంతోషం కాక మరెవరికి? దానికేంగాని బావా! దీపావళికి బహుమతి ఏం తెచ్చావు?"

"చెప్పుకో! ఏం తెచ్చానో?" "నాకేం తెలుస్తుంది నువ్వేం తెచ్చావో?"

"ముఖ్యంగా భారత మహిళకు కావలసిన వస్తువు తెచ్చాను"

"ఏదీ"

"ఇదిగో అంటూ ఒక పుస్తకం నళినీ చేతిలో పెట్టాడు. ఓ! ఆంధ్రమహిళా! మంచి పుస్తకం బహుమతితెచ్చావు బావా"

"నళినీ యింకో విషయం ఈ సంగతిచెబితే నీవు నాకేం యిస్తావో చూస్తాకదా!"

"చెప్పు బావా ఏమిటా సంతోషకరమైన విషయము?"

"ఏముంది! ఈ రోజు నాన్నగారితో నిన్ను తప్ప ఎవరిని పెండ్లిచేసుకోనని చెప్పేసాను. మరి ఏమనుకున్నారో ఏమో? అందరూ నిన్ను చేసుకోడానికి ఒప్పుకున్నారు"

"ఏమిటి బావా! నిజమేనా! ఆహా! ఏ దీపావళి రోజైతే మనము విడిచి పోయామో మళ్లీ ఆ దీపావళిరోజే మనము కలుసుకున్నాము. ఇదంతా నా అదృష్టము"

"అవును నీ అదృష్టమేకాని నా అదృష్టం మాత్రంకాదా చెబితే బహుమతి నిస్తానన్నావు. యివ్వవా మరి!"

"బావా నీవు నాకు బహుమతి ఆంధ్రమహిళ పుస్తకమే తెచ్చావు. కాని నేను మన యిద్దరి అదృష్టమును గురించి ఆంధ్రమహిళలో ప్రచురిస్తాను. అదే నేను నీకిచ్చే బహుమతి."

